క్లుప్తంగా...

మండ్ల రవికి డాక్టరేట్ ప్రదానం


మండ్ల రవి

ఉస్మానియా యూనివర్సిటీ: వలస కూలీల పై పరిశోధనకు మండ్ల రవికి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ఎకనామిక్స్ విభాగం విశ్రాంత అధ్యాపకులు ప్రొ.టీఎల్ఎన్ స్వామి పర్యవేక్షణలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వలస కూలీల ఆర్థిక, సామాజిక అంశాల పై పరిశోధనకు డాక్టరేట్ అందుకున్నారు.

పీహెచ్‌డీ ప్రవేశాలపై న్యాయపోరాటం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ప్రవేశాలు, వీసీ అనుసరిస్తున్న విధానాలపై న్యాయపోరాటం చేయనున్నట్లు ఐక్యవిద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పీహెచ్‌డీ ప్రవేశాల ప్రక్రియను నిలిపివేయాలని వివిధ ఫ్యాకల్టీల డీన్లకు వినతి పత్రం సమర్పించారు. యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశ పరీక్షల్లో 50 మార్కుల రీసెర్చ్ మెథాడాలజీ సబ్జెక్టు ప్రశ్నలను కాకుండా ఇతర సబ్జెక్టుల ప్రశ్నలతో పరీక్షను నిర్వహించారని తెలిపారు. కాకతీయ వర్సిటీలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అర్హత మార్కులు లేకున్నా పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించారని అదే విధానం ఓయూలో అమలు చేయాలని డిమాండ్‌తో న్యాయపోరాటానికి రంగం సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఆలయ పునఃప్రతిష్ఠ



చిలకలగూడ: చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని నాగలింగేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ వేడుకలు శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. మేళతాళాలు, బాజాభజంత్రీలు వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య ఫౌండర్ ట్రస్టీ నాగులూరి సాయిబాబా నాగలింగేశ్వరస్వామి, నందీశ్వరుడు మూలవిరాట్‌లను ప్రతిష్ఠించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన వేడుకల్లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. పూర్ణాహుతి సమర్పణతో పునఃప్రతిష్ఠ అత్యంత భక్తిశ్రద్ధలతో ముగిసిందని సాయిబాబా తెలిపారు.

13న జనరల్ బాడీ సమావేశం

సనత్‌నగర్: సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ జనరల్ బాడీ సమావేశం ఈ నెల 13న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో మారేడ్‌పల్లిలో జరుగుతుందనిటా పార్టీ రాష్ట్ర నాయకులు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఈ నెల 17వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు, అదేరోజు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయం ప్రారంభం, పరేడ్‌గ్రౌండ్‌లో బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో మంతి తలసాని శ్రీనివాస్ యాదవ్ పార్టీ శ్రేణులతో ఏర్పాట్లపై చర్చించనున్నట్లు చెప్పారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజ్ కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన జై బజరంగ్(28)కు ఏడాది క్రితం వివాహం జరిగింది. కుటుంబ కలహాల కారణంగా అతని భార్య వారం రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆమెను వెతుక్కుంటూ నగరానికి వచ్చిన బజరంగ్ తనకు తెలిసిన వారిని వాకబు చేశాడు. ఫలితం లేకపోవడంతో మనస్తాపానికి గురై ప్లాట్ ఫాం నెం. 2లోని క్యాటరింగ్ స్టాల్ వద్ద గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

రోడ్ల మూసివేతపై నిర్ణయం వాయిదా!

రక్షణ కమిటీ సూచన మేరకే చర్యలు



బోర్డు సమావేశంలో పాల్గొన్న సభ్యులు

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో రోడ్ల మూసివేతపై వాడివేడి చర్చ సాగింది. ముగ్గురు సభ్యుల వేరీడ్ బోర్డులో రోడ్ల మూసివేతకు అనుగుణంగా అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమశంకర్, వ్యతిరేకంగా సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు జే.రామకృష్ణ తమ వాదనలు వినిపించారు. దీనిపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో వచ్చే బోర్డు సమావేశంలో చర్చిద్దామంటూ వాయిదా వేశారు. ఆ లోపు రోడ్ల మూసివేతకు సంబంధించి రక్షణ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన కమిటీ సూచనల మేరకే తుది నిర్ణయం తీసుకుందామని తీర్మానించారు. బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సీఈఓ మధుకర్ నాయక్, సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ, డిప్యూటీ సీఈఓ విజయ్ కుమార్ బాలన్ నాయర్ పాల్గొన్నారు.

మా రోడ్లు ఎలా మూసేస్తారు?

ఇప్పటికే మూసేసిన రోడ్లకు సంబంధించి మళ్లీ నోటిఫికేషన్ ఎలా ఇస్తారని రామకృష్ణ ప్రశ్నించారు. ప్రతిపాదిత ఆరు రోడ్లలో రెండు 'సీ'కేటగిరికి చెందిన బోర్డు పరిధిలోని రోడ్లు అని, వీటిని ఆర్మీ అధికారులు ఎలా మూసేస్తారని ప్రశ్నించారు. ఆర్మీ రోడ్ల మూసివేతకు సంబంధించిన విధి, విధానాలను ఖరారు చేస్తూ 2018లో కేంద్రం ఇచ్చిన ఆదేశాలను ఆర్మీ తుంగలో తొక్కిందని రామకృష్ణ ఆరోపించారు. నోటిఫికేషన్‌లో ప్రకటించిన రోడ్లు రక్షణ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులకు ముందు నుంచే మూసేసి ఉన్నాయని బ్రిగేడియర్ సోమశంకర్ స్పష్టం చేశారు. తాము కేంద్రం ఉత్తర్వులకు అనుగుణంగా 2018 తర్వాత ఏ రోడ్డును కొత్తగా మూసేయలేదన్నారు. ఏదేమైనా ఈ మేరకు కేంద్రం ఏర్పాటు చేసిన కమిటీ నిర్ణయం మేరకే తుది నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు.

ద్వంద్వ ప్రమాణాలు ఎలా?

- ఆన్‌లైన్‌లో భవన నిర్మాణ దరఖాస్తులను ఓకే చేస్తూ ఉండటం వల్ల కొన్ని లోపాలు ఉన్నాయని రామకృష్ణ అన్నారు. ఈ నేపథ్యంలో గతంలో మాదిరిగి ప్లింత్ చెకింగ్ సర్టిఫికెట్ విధానాన్ని యథావిధిగా కొనసాగించాలన్నారు. ఈ విషయమై డీజీడీఈకి లేఖ రాశామని, సంబంధిత ఉత్తర్వులకు అనుగుణంగానే చర్యలుంటాయని సీఈఓ మధుకర్ నాయక్ తెలిపారు. ఇక ఇదే ఎజెండాలో మహేంద్రాహిల్స్‌లోని ఓ ప్రైవేటు భవన నిర్మాణం విషయంలో రామకృష్ణ విరుద్ధ నిర్ణయం తీసుకోవడాన్ని బ్రిగేడియర్ సోమశంకర్ తప్పుబట్టారు. అక్రమ నిర్మాణాలకు ఆస్కారం ఇవ్వొద్దు అంటూనే, అక్రమంగా వెలిసిన నిర్మాణానికి అనుకూలంగా ఎలా మాట్లాడుతారు అంటూ ప్రశ్నించారు. ఢిల్లీ పబ్లిక్ స్కూలు ప్రతిపాదించిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తిస్థాయి విచారణ జరిపాకే నిర్ణయం తీసుకుంటామని బ్రిగేడియర్ స్పష్టం చేశారు.

చర్చించిన అంశాలివే..

- కంటోన్మెంట్‌లో కొత్తగా పోల్ బ్యాండ్‌లను ఏర్పాటు చేస్తూ తీర్మానం.
- మూడో వార్డులోని మడ్‌ఫోర్ట్ బస్తీలో మంచి నీటి పైపులైన్ల ఏర్పాటు చేయాలని నిర్ణయించా రు. ఈ మేరకు ఎమ్మెల్యే సాయన్న రూ.3 లక్షల నిధులు కేటాయించినట్లు సీఈఓ వెల్లడించారు.
- సుమారు రూ.7 కోట్ల నిధులతో రోడ్లు, రూ.4 కోట్ల నిధులతో డ్రైనేజీ లైన్లు, ఇతరత్రాలకు రూ.1 కోటితో చేపట్టే పనులకు బోర్డు ఆమోదం తెలిపింది.
- దాదాపు పదిహేనేళ్ల సుదీర్ఘ విరామం అనంతరం బోర్డు పరిధిలో అక్రమ నిర్మాణాలకు జారీ చేసిన నోటీసుల అంశాన్ని బోర్డు ఎజెండాలో చేర్చారు. తాజాగా 30 అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చారు.
- ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ కాంట్రాక్టు దక్కించుకున్న స్వయంభూ సంస్థ, వివిధ కారణాల వల్ల తన కాంట్రాక్టును రద్దు చేయాలన్న అభ్యర్థనను బోర్డు ఆమోదించిందిన నిధులతో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన నీటి బిల్లు ఇతరత్రా బకాయిలు చెల్లించాలని నిర్ణయించారు.
- కేంద్రం గెజిట్ వెలువరించే దాకా టోల్ వసూళ్లను యథావిధిగా కొనసాగించాలని నిర్ణయించారు. ప్రతీ నెలా 10 శాతం అధికంగా చార్జీని మినహాయించాలన్న కాంట్రాక్టర్ విజ్ఞప్తిని తిరస్కరించారు. అయితే ఉల్లంఘనులపై జరిమానా విధించే వెసులుబాటు కల్పించారు.

'వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం'


సమావేశంలో మాట్లాడుతున్న సునీల్ బన్సల్

అమీర్‌పేట: కేసీఆర్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్ అన్నారు. ప్రజల సెంటిమెంట్‌తో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిందని, గడిచిన 9 ఏళ్లలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గం అమీర్‌పేట డివిజన్ బల్కంపేటలో జరిగిన కార్నర్ సమీవేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్, ఆయన కుమారుడు, కూతురు సహ కుటుంబ సభ్యులు మాత్రమే లబ్ధి పొందుతున్నారని విమర్శించారు. అవినీతి పెరిగిపోయిందని, ఓటు బ్యాంకు రాజకీయాలు ఎక్కువయ్యాయన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మోదీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని సైతం ప్రజలకు వివరించి పార్టీని బలోపేతం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ కేతినేని సరళ, పార్టీ జిల్లా అధ్యక్షులు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

మడ్‌ఫోర్ట్ హట్స్‌లో ..

రసూల్‌పురా: ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల పేర్లు మార్చి తమ పథకాలుగా చెప్పుకుంటూ పేదలకు కేంద్రం ఇస్తున్న నిధులను దారి మళ్లిస్తూ కేసీఆర్ ప్రభుత్వం అక్రమాలకు పాల్పడుతుందని మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు గరికపాటి రామ్మోహన్ రావు విమర్శించారు. కంటోన్మెంట్ నియోజకవర్గం మూడవ వార్డు మడ్‌ఫోర్ట్ హట్స్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజా గోస-బీజేపీ భరోసాలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 'డబుల్' ఇళ్లు ఉద్యోగాలు, నిరుద్యోగభృతి, అయూష్మాన్ భారత్ పథకం పేదలకు అందకుండా చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ చేస్తున్న అప్రజాస్వామిక విధానాలను బీజేపీ నిలదీస్తోందన్నారు. ముఖ్యంగా కంటోన్మెంట్ బోర్డుపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుండటంతో అభివృద్ధిలో వెనుకంజలో ఉందని మహంకాళి జిల్లా ఇన్‌చార్జ్ నామోజీరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోర్డు నామినేటెడ్ సభ్యులు జే. రామకృష్ణ, మహంకాళి జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ గౌడ్, నాయుడు ప్రకాష్, రజిని రెడ్డి, మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బిఎన్. శ్రీనివాస్, బట్టు శంకర్ పాల్గొన్నారు.

రాజెల్లయ్యకు ఘన నివాళి


రాజెల్లయ్య చిత్రపటానికి నివాళులర్పించిన నాయకులు

బన్సీలాల్‌పేట్: ఎమ్మార్పీఎస్ జాతీయ మాజీ కార్యదర్శి కె. రాజెల్లయ్య మాదిగ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సామాజిక ఉద్యమకారుడిగా సమాజహితం కోసం రాజెల్లయ్య చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. బన్సీలాల్ పేట్ బండమైసమ్మ నగర్ సమగ్రాభివృద్ధి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి ఆయన చేసి కృషి మరువలేనిదన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన రాజెల్లయ్య విలువలతో కూడిన జీవితాన్ని గడిపి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారన్నారు. బీజేపీ మహంకాళీ జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం సమన్వయకర్త టి. రాజశేఖరరెడ్డి, నాయకులు వై. సురేష్, స్పందన, ఉమేష్ ఖండెల్వాల్, జయరామ్, బీఆర్ఎస్ నాయకులు ఎస్. రాజేందర్, మోహన్‌రావు, జయరామ్ రాజెల్లయ్య చిత్రపటానికి పూలమాలలేసి శ్రద్ధాంజలి ఘటించారు.

బుడతకు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



అర్హాన్‌సాయి గౌరిశెట్టికి రికార్డు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న డా. చింతపట్ల వెంకటాచారి

లాలాపేట: బాల రవివర్మగా పేరు తెచ్చుకుంటున్న చిన్నారి బుడతడు అర్హాన్ సాయి గౌరిశెట్టి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నాడు. నగరానికి చెందిన అరుణ్ సాయి గౌరిశెట్టి, స్నేహిత ల ఏడాదిన్నర వయస్సున్న కుమారుడు అర్హాన్ సాయిగౌరిశెట్టి అతిచిన్న వయస్సులోనే పెయింటింగ్‌లో రాణిస్తున్నాడు. ఏకంగా పెద్ద వాళ్లను సైతం ఔరా అనిపించేలా వివిధ రకాల 50కి పైగా చిత్రాలను గీశాడు. ఆ చిన్నోడిలో ఉన్న సృజనాత్మకతను గుర్తించి తల్లిదండ్రులు అర్హాన్ గీసిన చిత్రాలన్నింటికి చక్కని ఫ్రేమ్‌లలో పెట్టారు. అతిపిన్న వయస్సులో అద్భుతమైన చిత్రాలు గీసిన చిన్నారి అర్హాన్ సాయి గౌరిశెట్టి సృజనాత్మకతను గుర్తింపుగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కల్పిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు చింతపట్ల వెంకటాచారి తెలిపారు.

'రాష్ట్రాభివృద్ధిలో సింహభాగం వాటా కేంద్రానిదే'


మాట్లాడుతున్న శ్యామ్‌సుందర్‌గౌడ్

చిలకలగూడ : తెలంగాణ అభివృద్ధితోపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల్లో సింహభాగం వాటా కేంద్రం భరిస్తుందని, ఈ విషయం ప్రజలకు వివరించాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి శక్తి కేంద్రం ఇన్‌ఛార్జ్ నరేష్ మాదిగ నేతృత్వంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాగోసా బీజేపీ భరోసాలో నాగురావు నామోజీ, శ్యామసుందర్‌గౌడ్, మేకల సారంగపాణి పాల్గొని మాట్లాడారు. కల్వకుంట్ల ఫ్యామిలీ తమ సొంత ఆస్తులను పెంచుకుంటూ, ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సరైన గుణపాఠం చెప్పేందుకు ప్రజలంతా ఎదురుచూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, హరి, శ్రీధరరావు, ప్రభుగుప్తా, గణేష్, వీరన్న, శ్రీనివాస్, దత్తు పాల్గొన్నారు.

డిసిమస్ కార్యక్రమానికి హాజరవ్వను

ప్రొ. గాలి వినోద్‌కుమార్


లేఖను చూపుతున్న ప్రొ. గాలి వినోద్‌కుమార్

లాలాపేట: ప్రొ. జీబీరెడ్డి అగ్రకుల ఆధిపత్య విధానాల కారణంగా ఓయూ లా కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిసిమస్-2023 న్యాయ విద్యార్థుల కల్చరల్ ఫెస్ట్‌లో పాల్గొనడం లేదని ఓయూ లా కళాశాల డీన్ ప్రొ. గాలి వినోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. డిసిమస్-2023 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌కు రాసిన లేఖను ఈ సందర్భంగా విడుదల చేశారు. ఓయూ లా కళాశాల సీనియర్ ప్రొ. జిబి రెడ్డి పలుమార్లు తనకు సీనియార్టీ ప్రకారం రావాల్సిన లా సెట్ కన్వీనర్ అవకాశం రాకుండా అడ్డుకుంటున్నారని తనకు జరిగిన అన్యాయంపై కోర్టుకు వెళితే తన ఫిర్యాదును బెంచి మీదకు రాకుండా చేయించి తనకు తీవ్రమైన అన్యాయానికి ఒడిగట్టారని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తితో వేదికపై కూర్చోలేకనే ఈ కార్యక్రమానికి హాజరుకావడం లేదన్నారు.

కంటివెలుగు శిబిరం సందర్శన

బన్సీలాల్‌పేట్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి అన్నారు. ఐడీహెచ్ కాలనీలోని కేంద్రాన్ని శుక్రవారం అయన సందర్శించి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆయా ప్రాంతాల్లోని పేదలు తమ సమీప కేంద్రానికి వెళ్లి కళ్లను పరీక్షించుకోవాలని అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు, మందులు అందజేస్తారన్నారు.

నీటి సరఫరా పెంచాలని కోరాం: ఆర్‌కే

కంటోన్మెంట్: పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా కంటోన్మెంట్‌కు సరఫరా చేసే నీటి మోతాదును పెంచాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామని రామకృష్ణ తెలిపారు. బోర్డు సమావేశం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుతం కంటోన్మెంట్‌కు 61 లక్షల గ్యాలన్లు మాత్రమే సరఫరా చేస్తున్నారని, ఈ మోతాదును 90 లక్షల గ్యాలన్లకు పెంచాలని కోరామన్నారు. ప్రధానమంత్రి ఖేలో ఇండియా స్ఫూర్తిగా ఇకపై కంటోన్మెంట్‌లోని అన్ని వార్డులో వేసవి క్రీడా క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు బోర్డులో తీర్మానం చేశామని తెలిపారు. రోడ్ల మూసివేతను ఎట్టి పరిస్థితిలో అడ్డుకుంటామన్నారు. తగిన నిబంధనలు పాటించకుండా రోడ్ల మూసివేతను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించమన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి


మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి

లాలాపేట: హాస్పిటల్‌కు వచ్చే రోగులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మెడికల్ ఆఫీసర్లదే అని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. లాలాపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జరిగిన హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ(హెచ్‌డీఎస్) సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఆ దిశగా వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. హాస్పిటల్‌కు అవసరమైన సౌకర్యాలపై సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్(ఎస్పీహెచ్ఓ) డాక్టర్ రాజశ్రీ, లాలాపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌశీల్యారాణి పాల్గొన్నారు.

జపాన్ విద్యా సంస్థలతో ఓయూ వీసీ ఒప్పందాలు

ఉస్మానియా యూనివర్సిటీ: జపాన్‌లోని విద్యా సంస్థలతో ఓయూ వీసీ ప్రొ.రవీందర్ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వర్సిటీ అధికార వర్గాలు పేర్కొన్నారు. టోక్యోలోని షిబౌరా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్ఐటీ) ఆహ్వానం మేరకు ఓయూ నుంచి పది విద్యార్థులతో వీసీ జపాన్ వెళ్లిన విషయం విదితమే. ఎస్ఐటీ సంస్థ అధ్యక్షులు జన్ యమద, అంతర్జాతీయ వ్యవహారాల డైరెక్టర్ తకుమి మియోషీ, ఓయూ వీసీ ప్రొ.రవీందర్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. రెండు విద్య సంస్థల మధ్య అత్యాధునిక సాంకేతిక సౌకర్యాలు పంచుకునేందుకు అవకాశాలు ఏర్పడుతాయన్నారు. మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు వినోద్‌కుమార్ 2019లో జపాన్ పర్యటన సందర్భంగా ఓయూ పూర్వ విద్యార్థి మిర్యాల మురళీధర్ ఈ ఒప్పందానికి కృషి చేసినట్లు తెలిపారు.

దక్కన్.. భూస్థాపితం



సికింద్రాబాద్ మినిస్టర్‌రోడ్‌లోని దక్కన్ భవనం కూల్చివేతలు పూర్తయ్యాయి. శుక్రవారం తెల్లవారుజామున ఒంటి గంట ప్రాంతంలో భవనం చివరి భాగాన్ని పూర్తిగా కూల్చివేశారు. ఇందులో పనిచేసే ముగ్గురు వ్యక్తులు గల్లంతు కాగా ఒకరి అస్థికలు మాత్రమే ఇందులో లభించగా మిగతా ఇద్దరి ఆచూకీ ఇప్పటికి దొరకలేదు. ఈ భవనం అగ్ని ప్రమాదంతో పూర్తిగా దెబ్బతినడంతో వరంగల్ నిట్ అధికారులు దీన్ని కూల్చివేయాలని నివేదికను అందించారు. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు మాలిక్ ట్రేడింగ్ డిమాలిషింగ్ అనే కంపెనీకి కూల్చివేత కాంట్రాక్టును అప్పగించారు. -రాంగోపాల్‌పేట్

హామీలు నెరవేర్చాం.. అభివృద్ధి చూపించాం!

రెండేళ్ల పాలనపై సాక్షితో కార్పొరేటర్లు

జీహెచ్ఎంసీ కార్పొరేటర్ల పాలన నేటి(శనివారం)తో రెండేళ్లు పూర్తి చేసుకుంటుంది. ఇందులో భాగంగా సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు తమ రెండేళ్ల పాలనలో చేసిన, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై వివరణ ఇచ్చారు. అదేవిధంగా ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించడంలో తాము చేసిన కృషిని గురించి చెప్పుకొచ్చారు. కాగా చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించే సంక్షేమ ఫలాలలో స్థానికంగా ఉండే మంత్రి, ఎమ్మెల్యేల సహకారంను 'సాక్షి'తో పంచుకున్నారు. – సికింద్రాబాద్

80 శాతం హామీలు నెరవేర్చాం..

అడ్డగుట్ట: అడ్డగుట్టను ఆదర్శ డివిజన్‌గా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. కార్పొరేటర్‌గా బాధ్యతలు చేపట్టిన ఈ రెండేళ్లలో అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశాం. దశాబ్దాల సమస్యలైన తుకారాం గేట్ ఆర్‌యూబీ నిర్మాణం, రియో పాయింట్ రోడ్డు నిర్మాణం తమ హయాంలోనే పూర్తవ్వటం సంతోషకరం. అదే విధంగా రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సమస్యలన్నీ ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరించాం. మంచినీటి లోప్రెషర్ సమస్యను సైతం అధిగమించి పలు బస్తీల్లో నాలా సమస్యలను పరిష్కరించి వర్షాకాలంలో నాలా పరివాహక వాసులు ఎదుర్కొనే సమస్యలకు సైతం స్వస్తి పలికాం. ఎన్నికల సమయంలో డివిజన్ ప్రజలకు ఇచ్చిన హామీల్లో దాదాపు 80 శాతం పూర్తి చేశాం.



–లింగాని ప్రసన్నలక్ష్మి, అడ్డగుట్ట కార్పొరేటర్

రూ. 20 కోట్లతో అభివృద్ధి పనులు



చిలకలగూడ : రెండేళ్ల పదవీకాలం సంతృప్తిగా గడిచింది. సుమారు రూ. 20 కోట్లతో డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టాం. రెండేళ్ల వ్యవధిలో రూ. 10 కోట్ల వ్యయంతో ఓపెన్ నాలా ప్రహరీ ఎత్తు పెంపు, అడ్డంగా ఉన్న కేబుల్స్ తొలగింపు, ఫెన్సింగ్ ఏర్పాటు చేసి దశాబ్దాలుగా నెలకొన్న ముంపు సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడం సంతృప్తి నిచ్చింది. మరో రూ. 10 కోట్ల వ్యయంతో రహదారుల అభివృద్ధి, మంచినీటి, సివరేజీ నూతన పైప్‌లైన్లు ఏర్పాటు చేశాం. గ్రంథాలయం, ఇండోర్ స్టేడియం, కమ్యూనిటీహాళ్ల నిర్మాణమే తన లక్ష్యం. డిగ్రీ కళాశాల, కుట్టివెలోడీ ఆస్పత్రులకు రూ. 42 కోట్లు మంజూరు అయ్యాయి ఏడాది వ్యవధిలో నిర్మాణాలు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– సామల హేమ, సీతాఫల్‌మండి కార్పొరేటర్

తార్నాకను అగ్రగామిగా నిలిపాం..



లాలాపేట: రెండేళ్ల పదవీ కాలం ఎంతో సంతృప్తికరంగా కొనసాగింది. నగరంలోనే తార్నాక డివిజన్ ప్రాంతాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపాం. మరో వైపు జీహెచ్ఎంసీ నగర అభివృద్ధిలో ఎంతో క్రియాశీలకంగా ముందుకు వెళుతున్నాం.తార్నాక, లాలాపేట, శాంతినగర్, మాణికేశ్వర్‌నగర్ ప్రాంతాల్లో దాదాపుగా రూ. 50 కోట్లతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాం. రూ. 6 కోట్లతో స్విమ్మింగ్ పూల్, రూ 6 కోట్లతో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, రోడ్డు విస్తరణ, లాలాపేట ఫ్లైఓవర్ సుందరీకరణ రోడ్లు, సివరేజ్, వైకుంఠధామ అభివృద్ధి, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు చేపట్టాం. ఓయూ క్యాంపస్‌లోని 9 బస్తీలకు చెందిన వారికి, చంద్రబాబునగర్‌లో శిథిలావస్థకు చేరిన వాంబే గృహాల వాసులు, అర్హులైన పేద ప్రజలందరికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా 'డబుల్' ఇళ్ల నిర్మాణం చేయించాలనేది తమ డ్రీమ్ ప్రాజెక్టు.

–మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ జీహెచ్ఎంసీ

అభివృద్ధి దిశగా ముందుకు..



–కంది శైలజ, బౌద్ధనగర్ కార్పొరేటర్

బౌద్ధనగర్: డివిజన్ మరింత మెరుగైన అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాం. బౌద్ధనగర్ కార్పొరేటర్‌గా రెండేళ్లు విజయవంతంగా పూర్తి చేసుకోవడం ఎంతో సంతోషకరంగా ఉంది. ఈ రెండేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల ఆదరణ పొందాం. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీ, నాలా సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించి, డివిజన్‌లో రూ. 2.75 కోట్లతో సీసీ రోడ్డు రూ. 1.3 కోట్లతో నాలా పనులు, రూ. కోటికి పైగా నిధులతో సీవరేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించాం. డివిజన్ వ్యాప్తంగా రోడ్లకు రూ. 7 కోట్లు, సీవరేజీ, తాగునీటి పైప్‌లైన్ల కోసం రెండున్నర కోట్లకు ప్రతిపాదనలు చేశాం.